సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
శుక్రవారం । 18 । ఆగస్టు । 2023



సింగరేణిని కాపాడుకుందాం

ప్రైవేటీకరణ, ఆర్థిక దోపిడీ నుంచి సింగరేణిని కాపాడుకుందామని కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు. 8లో



నిత్యాన్నదానానికి విరాళం

భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి ఆలయంలో జరిగే నిత్యాన్నదాన కార్యక్రమానికి భక్తులు విరాళం అందజేశారు. 8లో

గరిష్టం / కనిష్టం
28° / 24°

వాతావరణం

జిల్లాలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురుస్తుంది. వాతావరణం చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

పెద్దమ్మతల్లి ఆలయంలో శ్రావణ పూజలు ప్రారంభం



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్ : మండలంలో కొలువుదీరిన శ్రీ పెద్దమ్మతల్లి ఆలయంలో నెల రోజుల పాటు కొనసాగనున్న శ్రావణమాస పూజలు గురువారం ప్రారంభించారు. అర్చకులు ముందుగా గణపతి పూజ, కలశస్థాపన, కుంకుమ పూజలు నిర్వహించారు. అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో అర్చన చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రావణమాసం నెల రోజులపాటు గోత్ర నామాలతో అమ్మవారికి కుంకుమ పూజలు జరిపించుకునే భక్తులు రూ.516 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఈఓ రజినీకుమారి తెలిపారు. అమ్మవారికి చీరలు సమర్పించే భక్తులు ఈనెల 20న అందజేయాలని సూచించారు. 25న సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఉంటాయని పేర్కొన్నారు.

మందుల పిచికారీ ఆపండి

కొత్తగూడెంఅర్బన్: వచ్చే రెండు రోజుల్లో జిల్లాలో మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వ్యవసాయ శాఖ వాతావరణ విభాగం పర్యవేక్షకులు ఎం.సుమన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాల ఉన్నందున రైతులు పురుగు మందుల పిచికారీ, రసాయనిక ఎరువులు వేయడాన్ని తాత్కాలికంగా వాయిదా వేయాలని సూచించారు.

కేంద్ర బృందం పర్యటన



ఇరవెండిలో వివరాలు సేకరిస్తున్న బృందం

చుంచుపల్లి: జిల్లాలోని పలు గ్రామాల్లో స్వచ్ఛ సర్వేక్షణ్ కేంద్ర బృందం పర్యటించింది. బూర్గంపాడు మండలం ఇరవెండి, ఆళ్లపల్లి మండలం అనంతోగు, చుంచుపల్లి మండలం ప్రశాంతినగర్ గ్రామాల్లో బృందం సభ్యులు గురువారం పలు పనులను పరిశీలించారు. ఎస్‌హెచ్‌జీల పనితీరు, పారిశుద్ధ్యం, వ్యక్తిగత మరుగుదొడ్ల వాడకం, నిర్వహణ, తడి పొడి చెత్త సేకరణ, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ వంటి వాటిపై ఆరా తీశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో భాగంగా సేకరించిన అంశాల ఆధారంగా గ్రామాలకు ర్యాంక్‌లు కేటాయించనున్నట్లు తెలిపారు. కాగా, జిల్లాలో ఈ బృందం నాలుగు రోజులు 20 గ్రామ పంచాయతీల్లో పర్యటించనుంది. కార్యక్రమంలో సభ్యులు వెంకట్, సుధాకర్‌రెడ్డి, పరుశురామ్, ఎస్‌బీఎం జిల్లా కో–ఆర్డినేటర్ రేవతి తదితరులు పాల్గొన్నారు.

వైన్స్ దరఖాస్తుకు నేడు తుది గడువు



దరఖాస్తులు స్వీకరిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కొత్తగూడెంఅర్బన్: నూతన మద్యం దుకాణాలకు దరఖాస్తుల సంఖ్య భారీగా పెరుగుతోంది. శుక్రవారంతో గడువు ముగుస్తుండడంతో జిల్లాలోని అన్ని ప్రాంతాల నుంచి ఎక్సైజ్ కార్యాలయానికి అధిక సంఖ్యలో వచ్చి దరఖాస్తులు సమర్పిస్తున్నారు. దీంతో గురువారం కార్యాలయ ఆవరణంతా దరఖాస్తుదారులతో నిండిపోయింది. ఆరు కౌంటర్లు ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరిస్తున్నారు. సాయంత్రం 6 గంటల వరకే దరఖాస్తులు తీసుకోవాల్సి ఉండగా, శ్రావణమాసం తొలిరోజు సెంటిమెంట్‌తో భారీ సంఖ్యలో దరఖాస్తుదారులు వచ్చారు. దీంతో సాయంత్రం 6 గంటల వరకు క్యూలో ఉన్న వారందరి దరఖాస్తులను అధికారులు రాత్రి వరకూ స్వీకరించారు. శుక్రవారం చివరి రోజు కావడంతో భారీగా దరఖాస్తులు వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. 21న పాల్వంచలోని టీఎస్ జెన్‌కో హౌసింగ్ కాలనీలో డ్రా తీయనున్నారు.

కాంట్రాక్ట్ సిబ్బంది సర్వీస్ ఏడాది పెంపు

కొత్తగూడెంఅర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన పనిచేస్తున్న వారి సర్వీస్ ఏడాది పాటు పొడగించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రవిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇవి ప్రతి సంవత్సరం ఇచ్చే ఆదేశాలు మాత్రమేనని, కొత్త పోస్టులు మంజూరు కాలేదని పేర్కొన్నారు. కొత్త పోస్టుల భర్తీపై ఆదేశాలు వస్తే నోటిఫికేషన్ వెల్లడించి నియామకాలు చేపడతామని తెలిపారు.

గేరు మార్చిన కారు



ఎన్నికల నేపథ్యంలో దూకుడు పెంచిన బీఆర్‌ఎస్

- తెల్లం కాంగ్రెస్‌ను వీడి వెనక్కు వచ్చేలా వ్యూహం
- మరికొందరు నేతలనూ లాగేందుకు ప్రయత్నాలు
- జిల్లా వ్యాప్తంగా అభివృద్ధి పనులకు శ్రీకారం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: మూడోసారి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చేందుకు భారత రాష్ట్ర సమితి వ్యూహాత్మకంగా పావులు కదుపుతోంది. ముఖ్యంగా ఆ పార్టీకి కొరకరాని కొయ్యగా మారిన భద్రాద్రి జిల్లా రాజకీయాలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టింది. దీంతో గత వారం రోజులుగా జిల్లాలో బీఆర్‌ఎస్ పరిణామాలు కీలకంగా మారాయి.

పొంగులేటి జోరు..

బీఆర్‌ఎస్‌పై పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఈ ఏడాది ఆరంభంలో తిరుగుబాటు బావుటా ఎగురవేశారు. ప్రతీ నెల ఒక్కో నియోజకవర్గంలో ఆత్మీయ సమ్మేళనాలు ఏర్పాటు చేస్తూ బీఆర్‌ఎస్‌పై విమర్శలు ఎక్కుపెట్టారు. ఆ తర్వాత తన వర్గం నేతలతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో పర్యటిస్తూ తన అనుచరులు, మద్దతుదారులతో సమావేశాలు నిర్వహించారు. పొంగులేటి ప్రభావంతో చాలా చోట్ల ద్వితీయ శ్రేణి నేతలు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. మరికొందరు చేరేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారు. దీంతో పొంగులేటి చేరిక తర్వాత కాంగ్రెస్‌లో కొత్త జోష్ కనిపించడం మొదలైంది.

ప్రత్యామ్నాయం కోసం పావులు..

భద్రాచలం తర్వాత సిట్టింగ్ ఎమ్మెల్యేలపై వ్యతిరేకత కనిపిస్తున్న మరో రెండు నియోజకవర్గాల మీద కూడా బీఆర్‌ఎస్ దృష్టి సారించింది. ఇప్పటికిప్పుడు సిట్టింగులకు ప్రమాదమేమీ లేకున్నా ప్రత్యామ్నాయ అభ్యర్థులను సిద్ధం చేసేందుకు పావులు కదుపుతోంది. అందులో భాగంగా పార్టీని వీడిన నేతలను తిరిగి రప్పించేందుకు హైదరాబాద్ నుంచి ప్రత్యేక దూతలు జిల్లాలో మకాం వేశారు. 'రాబోయేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని, మీకు అన్ని విధాలా అండదండలు ఉంటాయని' హామీలు ఇస్తున్నారు. కొందరికైతే రాబోయే ఎన్నికల్లో అసెంబ్లీ టికెట్ కూడా ఆఫర్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ చర్చలు సానుకూల ఫలితాలు ఇస్తే రాబోయే వారం, పది రోజుల్లో గులాబీ పార్టీలో మరిన్ని చేరికలు ఉండే అవకాశం ఉంది.

చాపకింద నీరులా..



కేటీఆర్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరిన తెల్లం వెంకట్రావ్ పక్కన, మంత్రి అజయ్, విప్ రేగా

పైకి హడావుడి చేయకపోయినా గులాబీ పార్టీ నేతలు జిల్లాలో పార్టీ పరిస్థితిపై ఎప్పటికప్పుడు సర్వేలు చేస్తూ డేటా తెప్పించుకున్నారు. నియోజకవర్గాల వారీగా క్షేత్రస్థాయిలో పరిస్థితిని విశ్లేషించుకుని గత రెండు వారాలుగా చాపకింద నీరులా యాక్షన్ ప్లాన్ అమలు చేయడం ప్రారంభించారు. ముందుగా ఆ పార్టీకి బలమైన అభ్యర్థి కరువైన భద్రాచలంపై దృష్టి సారించారు. దీంతో పొంగులేటి వెంట కాంగ్రెస్‌లో చేరిన తెల్లం వెంకట్రావుతో చర్చలు జరిపారు. రాజకీయ భవిష్యత్‌కు, భద్రాద్రి అభివృద్ధికి భరోసా ఇచ్చారు. దీంతో సుదీర్ఘ కాలం పొంగులేటి వెంట నడిచిన తెల్లం.. చివరకు అయనకు చెయ్యిచ్చి మంత్రి కేటీఆర్ సమక్షంలో గులాబీ కండువా కప్పుకున్నారు.

గత ఎన్నికల్లో పరాజయం..

తెలంగాణ ఏర్పాటైనప్పటి నుంచి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో బీఆర్‌ఎస్‌కు సానుకూల ఫలితాలు రాలేదు. 2014లో తొలిసారి కొత్తగూడెం స్థానం నుంచి విజయం సాధించగా, 2018లో రెండోసారి జరిగిన ఎన్నికల్లో జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో ఒక్క చోటా గెలుపొందలేదు. అయితే హస్తం గుర్తుపై గెలుపొందిన ఎమ్మెల్యేలు చట్టపరంగా కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. ఆ తర్వాత జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో కారు గుర్తుపై పోటీ చేసిన వారు కనీవినీ ఎరుగని స్థాయిలో విజయం సాధించారు. ఇక ఏడాది కాలంగా బీఆర్‌ఎస్ అగ్రనేతలెవరూ జిల్లాపై అంతగా ఫోకస్ పెట్టలేదు. 2022 జూలైలో గోదావరి వరదలు, 2023 జనవరిలో నూతన కలెక్టరేట్ ప్రారంభోత్సవాలకు సీఎం కేసీఆర్ వచ్చారు. పోడు పట్టాల పంపిణీకి గత జూలైలో హరీశ్‌రావు వచ్చారు. పార్టీలో కీలకంగా ఉన్న కేటీఆర్ జిల్లా వైపు చూడనేలేదు. అగ్రనేతల పర్యటనలతో మిగిలిన జిల్లాల్లో పార్టీ పరంగా దూకుడు ఉండగా భద్రాద్రి బీఆర్‌ఎస్‌లో ఈ జోష్ నిన్నామొన్నటి వరకు కనిపించలేదు. జిల్లా పార్టీ కార్యాలయంలో కూడా ఎలాంటి అలికిడి ఉండేది కాదు.

త్వరలో మంత్రుల పర్యటనలు..

జిల్లా కేంద్రమైన కొత్తగూడెం నియోజకవర్గం నుంచి కారు గుర్తుపై పోటీ చేసే అభ్యర్థిని ఎలాగైనా గెలిపించుకోవాలనే పట్టుదలలో బీఆర్‌ఎస్ అధిష్టానం ఉంది. దీంతో కొత్తగూడెంపై ఇటు పార్టీ, అటు ప్రభుత్వ పరంగా ప్రత్యేక దృష్టి పెట్టారు. స్థానిక ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావుతో పాటు మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, పువ్వాడ అజయ్‌కుమార్ త్వరలో కొత్తగూడెంలో పర్యటించేలా షెడ్యూల్ రెడీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇల్లెందు, అశ్వారావుపేట, భద్రాచలంలో కూడా మంత్రి హరీశ్ పర్యటించే అవకాశం ఉంది. మంత్రి పర్యటించే నాటికి ఆయా నియోజకవర్గాల్లో పార్టీ నేతలందరినీ ఒక్కతాటిపైకి తెచ్చే కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది.

సౌకర్యాల కల్పనకు నివేదికలు ఇవ్వండి

మహిళా, శిశు సంక్షేమ అధికారులకు కలెక్టర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక

కొత్తగూడెంఅర్బన్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు నివేదికలు అందజేయాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారులను ఆదేశించారు. నిత్యావసర వస్తువులు, పోషణ, న్యూట్రిగార్డెన్ల ఏర్పాటు, అంగన్‌వాడీ భవనాల నిర్మాణం తదితర అంశాలపై గురువారం ఐడీఓసీలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి నెలా 10వ తేదీలోగా చిన్నారులకు గ్రోత్ మానిటరింగ్ డ్రైవ్ పూర్తి చేయాలని, వివరాలను పోషణ్ ట్రాకర్‌లో నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో తీవ్ర పోషణ లోపం ఉన్నట్లు గుర్తించిన 683 మంది, అతితీవ్రపోషణ లోపం ఉన్నట్లు గుర్తించిన 2,293 మంది చిన్నారుల ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి బుధవారం అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణ లోపాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. గృహ హింసకు గురయ్యే మహిళల సంరక్షణకు సఖీ కేంద్రం 24 గంటలూ పని చేస్తోందని, 13 మంది విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. 1098కు ఫోన్ చేసి లేదా నేరుగా సఖి కేంద్రానికి వచ్చి ఫిర్యాదు చేయొచ్చన్నారు. చిన్నారులకు పోషకాహారాన్ని అందించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లో న్యూట్రి గార్డెన్లు ఏర్పాటు చేశామని, వాటి నిర్వహణ, ఏర్పాటుపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. దివ్యాంగులకు ఆర్థిక సాయం అందించేందుకు ఆన్‌లైన్ పోర్టల్‌లో వచ్చిన దరఖాస్తుల విచారణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. జిల్లాలో 2,060 అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు బాలామృతం, స్పాట్ ఫీడింగ్ అందజేస్తున్నట్లు చెప్పారు. మణుగూరులో బాలల సంరక్షణ కేంద్రంలో సౌకర్యాలపై నివేదిక ఇవ్వాలని సూచించారు. సీఎస్సార్, ఎస్‌సీపీ నిధులతో నిర్మిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల ప్రగతిపై నివేదికలు అందజేయాలన్నారు. సమావేశంలో మహిళా, శిశు సంక్షేమ అధికారి సబిత, అన్ని ప్రాజెక్టుల సీడీపీఓలు, ఏసీడీపీఓలు పాల్గొన్నారు.

రేపు 5 కే రన్

ఓటు హక్కు ప్రాధాన్యత, వినియోగం, ఓటరు నమోదు కార్యక్రమాలపై శనివారం ఉదయం 6 గంటలకు అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో 5 కే రన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ మేరకు ఏర్పాట్లు చేయాలని తహసీల్దార్లను ఆదేశించారు. కొత్తగూడెంలో పోస్టాఫీస్ సెంటర్ నుంచి లక్ష్మీదేవిపల్లి మండలంలోని సెంట్రల్ పార్కు వరకు రన్ ఉంటుందన్నారు. వయోభేదం లేకుండా ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. మణుగూరులో హనుమాన్‌టెంపుల్ నుంచి సురక్ష బస్టాండ్ వరకు, ఇల్లెందులో గోవింద్ సెంటర్ నుంచి సుదిమళ్ల స్టేజి వరకు, అశ్వారావుపేటలో రింగ్ రోడ్డు నుంచి ఉట్లపల్లి వరకు, భద్రాచలంలో బ్రిడ్జి పాయింట్ చెక్‌పోస్టు నుంచి సీఆర్‌పీఎఫ్ క్యాంప్ చెక్‌పోస్టు వరకు రన్ ఉంటుందని వివరించారు.

ఉద్యమంలా లెప్రసీ గుర్తింపు

డీపీఎంఓ వెంకటేశ్వరరావు



సర్వేను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు

చండ్రుగొండ : కుష్టు వ్యాధి నివారణకు బాధితుల గుర్తింపు సర్వే ఉద్యమంలా సాగుతోందని జిల్లా పారా మెడికల్ అధికారి వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని పోకలగూడెంలో సాగుతున్న సర్వే ప్రక్రియను గురువారం ఆయన పరిశీలించారు. ఈ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తిస్తే మందులతో నివారించవచ్చని అన్నారు. కాళ్లు, చేతులకు స్పర్శ లేకపోయినా, శరీరంపై రాగి, లేత గోధుమరంగు మచ్చలు ఉన్నా సర్వే బృందాలకు తెలియజేయాలని కోరారు. కాళ్లు, చేతులు తిమ్మిర్లున్నా , పుండ్ల వంటివి ఉన్నా కుష్టు వ్యాధి లక్షణాలుగా భావించవచ్చని, అలాంటి వారు భయపడకుండా సర్వే సిబ్బందికి తెలియజేయాలని అన్నారు. వైకల్యం రాకముందే మందులు వాడితే వ్యాధిని పూర్తిగా అదుపు చేయవచ్చని తెలిపారు. ఈనెల 31 వరకు సర్వే ఉంటుందని, ప్రజలు సహకరించాలని కోరారు.

ముమ్మరంగా సర్వే

- గృహలక్ష్మి దరఖాస్తుదారుల వద్దకు సిబ్బంది
- స్థలాల పరిశీలన, వివరాల సేకరణ
- జిల్లాలో సొంతింటి కోసం వచ్చిన దరఖాస్తులు 86,773



శ్రీఇంక్లైన్‌లో గృహలక్ష్మి సర్వే చేస్తున్న పంచాయతీ సిబ్బంది (ఫైల్)

చుంచుపల్లి: జిల్లాలో గృహలక్ష్మి పథకం అమలుకు శరవేగంగా అడుగులు పడుతున్నాయి. సొంత స్థలం ఉండి ఇల్లు లేని పేదలకు రూ.3 లక్షల ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వ ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. ఈనెల 7 నుంచి 10వ తేదీ వరకు మున్సిపాలిటీలు, గ్రామ పంచాయతీల పరిధిలో పేదల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దీంతో జిల్లా వ్యాప్తంగా నాలుగు మున్సిపాలిటీలు, 23 మండలాల పరిధిలో 86,773 మంది పేదలు దరఖాస్తు చేసుకున్నారు. కాగా, ఈనెల 20లోపు అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, 25వ తేదీ నాటికి అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ క్రమంలో జిల్లా అధికారులు గ్రామాలు, పట్టణాల్లో క్షేత్రస్థాయికి వెళ్లి సర్వే నిర్వహిస్తున్నారు. గ్రామాల పరిధిలో పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, మున్సిపాలిటీల పరిధిలో అధికారులు, సిబ్బంది నేరుగా దరఖాస్తుదారుల ఇంటికి వెళ్లి స్థలాలను పరిశీలిస్తున్నారు. వారు జత చేసిన ఆధారాల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. ప్రస్తుతం ఈ సర్వే జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో ముమ్మరంగా సాగుతోంది.

గృహలక్ష్మి పథకానికి మార్గదర్శకాలివే..

- గృహలక్ష్మి పథకంలో మహిళల పేరుతో ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల ఆర్థిక సాయం మంజూరుచేస్తారు.
- లబ్ధిదారుల పేరుతో ఆహార భద్రత కార్డు, సొంత స్థలం కలిగి ఉండి అక్కడే నివాసం ఉంటున్నట్లు ఆధారాలు ఓటర్ ఐడీ, ఆధార్‌కార్డు చూపించాలి.
- గృహలక్ష్మి పథకంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యం కల్పిస్తున్నారు. ప్రతి నియోజకవర్గ పరిధిలో ఎస్సీలకు 20 శాతం, ఎస్టీలకు 10 శాతం, బీసీలు, మైనారిటీలకు 50 శాతం తగ్గకుండా అవకాశం కల్పిస్తారు. దివ్యాంగులకు 5 శాతం వర్తింపజేస్తారు.
- ఈ పథకంలో లబ్ధిదారుడు తనకు నచ్చిన డిజైన్‌లో ఇల్లు నిర్మించుకోవచ్చు. ఇది రెండు పడకల ఆర్‌సీసీ మోడల్ ఇంటి నిర్మాణానికి కూడా వర్తిస్తుంది.
- ఇంటి నిర్మాణ పురోగతిని బట్టి మూడు విడుతల్లో ఆర్థిక సాయం అందుతుంది. పునాది దశలో రూ.లక్ష, రూఫ్ లెవల్‌లో రూ.లక్ష, నిర్మాణం పూర్తయ్యాక రూ.లక్ష అందజేస్తారు.
- నిర్మాణం పూర్తయిన తర్వాత లబ్ధిదారులు ఎప్పటికప్పుడు ఆయా ఫొటోలను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. నగదు జమ చేయడానికి ప్రత్యేక బ్యాంక్ ఖాతా తెరవాల్సి ఉంటుంది.
- లబ్ధిదారులకు ఇంతకుముందు ఆర్‌సీసీ రూఫ్‌తో ఇల్లు ఉంటే అనర్హులుగా ప్రకటిస్తారు. అదే విధంగా ఎవరైనా కుటుంబసభ్యులు జీఓ 59 ప్రకారం ఇంతకుముందే లబ్ధి పొందినా ఈ పథకం వర్తించదు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయండి

జెడ్పీ సీఈఓ విద్యాలత



తిప్పనపల్లిలో గృహలక్ష్మి దరఖాస్తుల సర్వేను పరిశీలిస్తున్న విద్యాలత

చండ్రుగొండ : గృహలక్ష్మి దరఖాస్తుల క్షేత్రస్థాయి పరిశీలన వేగవంతం చేయాలని జెడ్పీ సీఈఓ విద్యాలత అన్నారు. మండలంలోని తిప్పనపల్లి, తుంగారం గ్రామాల్లో దరఖాస్తులను ఆమె గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిబంధనల ప్రకారం విచారణ చేయాలని అధికారులకు సూచించారు. రేషన్‌కార్డు, సొంత స్థలం ఉన్న వారి దరఖాస్తులను పరిగణనలో తీసుకోవాలని, పక్కా ఇల్లు ఉన్న వారి దరఖాస్తులను తిరస్కరించాలని చెప్పారు. ఈనెల 18 నాటికి పరిశీలన పూర్తి చేయాలన్నారు. ఆమె వెంట ఎంపీడీఓ జి.రేవతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాణి ఉన్నారు.

బకాయిలు చెల్లించండి

ఆలయాభివృద్ధికి సహకరించాలి



అధికారులతో చర్చిస్తున్న ఈఓ రమాదేవి

దుమ్ముగూడెం: పర్ణశాల దేవాలయ స్థలంలో దుకాణాలు నిర్వహిస్తున్న వారు ఆలయానికి బకాయి ఉన్న నగదును తక్షణమే చెల్లించి ఆలయ అభివృద్ధికి సహకరించాలని భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారి ఆలయ ఈఓ రమాదేవి సూచించారు. గురువారం ఆమె పర్ణశాల ఆలయాన్ని సందర్శించి దుకాణదారులు, అధికారులతో సమావేశమయ్యారు. ఆలయ భద్రతపై సీఐ దోమల రమేష్‌తో చర్చించారు. అనంతరం మాట్లాడుతూ.. భక్తులు ఆలయానికి వచ్చే దారిలో ఉన్న దుకాణాలను తొలగించాలని గతంలో చెప్పినా సదరు దుకాణదారులు పట్టించుకోవడం లేదని, రెండు, మూడు రోజుల్లో తామే తొలగించి ఆలయానికి భక్తులు వచ్చేలా చూస్తామని తెలిపారు. ప్రస్తుతం ఉన్న పాత రహదారికి బారికేడ్లు ఏర్పాటు చేసి వీఐపీలు వచ్చినప్పుడు మాత్రమే తెరుస్తామని చెప్పారు. ఈఓ వెంట ఏఈఓ భవానీ రామకృష్ణ, డీఈ రవీందర్ తదితరులు ఉన్నారు.

తగ్గిన సాగు..

- వానాకాలం సీజన్ ఆలస్యమే కారణం
- జిల్లాలో సాధారణ విస్తీర్ణం అంచనా 4,25,393 ఎకరాలు
- ఇప్పటి వరకు 3,45,761 ఎకరాల్లోనే పలు రకాల పంటలు
- పెరిగిన పత్తి.. భారీగా తగ్గిన వరి



లక్ష్మీదేవిపల్లి మండలంలో వరి నాట్లు వేసిన పొలం (ఇన్‌సెట్) సిద్ధంగా ఉన్న వరి నారు

సూపర్‌బజార్(కొత్తగూడెం): యాసంగి పంటలు చేతికందే సమయానికి అకాల వర్షాలతో తీవ్ర నష్టం వాటిల్లుతున్న నేపథ్యంలో పంటల సీజన్‌ను ముందుకు జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో వానాకాలం పంటల సాగు కూడా ముందే ప్రారంభించాలని భావించింది. అయితే ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల కారణంగా వానాకాలం సీజన్ పంటల సాగు నిర్ణీత సమయం కంటే నెల ఆలస్యంగా ప్రారంభమైంది. ఈ సీజన్‌లో పంటల సాగు 4,25,393 ఎకరాల సాధారణ విస్తీర్ణం కాగా, ఇప్పటి వరకు 3,45,761 ఎకరాల్లో మాత్రమే రైతులు వివిధ పంటలు వేశారు. వ్యవసాయ శాఖ అంచనా వేసిన సాధారణ విస్తీర్ణంలో 81 శాతం పంటలు మాత్రమే ఇప్పటివరకు సాగయ్యాయి. ముఖ్యంగా వరి పంట సాధారణ విస్తీర్ణంలో మూడో వంతు మాత్రమే వేయడం గమనార్హం. అయితే ఈనెల చివరి వరకు వరి వేసుకునే అవకాశం ఉన్నందున విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయ శాఖ అంచనా వేస్తోంది. వరి సాధారణ విస్తీర్ణం 1,51,119 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 53,404 ఎకరాల్లో మాత్రమే నాట్లు వేయడంతో 35.34 శాతంగా నమోదైంది. జొన్న 20 ఎకరాలు కాగా ఇప్పటి వరకు అసలు వేయనే లేదు. మొక్కజొన్న 32,717 ఎకరాలకు గాను అంతకంటే ఎక్కువగా 51,895 ఎకరాల్లో సాగు చేస్తుండగా 158.62 శాతం నమోదైంది. పత్తి 1,39,598 ఎకరాలు సాధారణ విస్తీర్ణం కాగా రైతులు ఏకంగా 1,99,095 ఎకరాల్లో వేయడంతో 142.62 శాతం నమోదైంది. పెసర 288 ఎకరాలకు గాను 206 ఎకరాల్లో (71.53 శాతం), మినుము 503 ఎకరాలకు గాను కేవలం 12 ఎకరాల్లోనే (2.39 శాతం), కంది 5,611 ఎకరాలకు గాను 5,742 ఎకరాల్లో (102.34 శాతం), వేరుశనగ 1,376 ఎకరాలకు గాను 224 ఎకరాల్లో(16.28 శాతం) నువ్వులు 143 ఎకరాలకు గాను 23 ఎకరాల్లో(16.08 శాతం), అలసంద 131 ఎకరాలకు 36 ఎకరాల్లో (27.48 శాతం), మిరప 14,404 ఎకరాలకు గాను 236 ఎకరాల్లో (6.4 శాతం), చెరకు 1,245 ఎకరాలకు గాను 104 ఎకరాల్లో (8.35 శాతం) మాత్రమే ఇప్పటివరకు సాగయ్యాయి. ఇతర పంటలు 63,834 ఎకరాలకు గాను 34,784 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. ఈసారి సాగు విస్తీర్ణం పెరుగుతుందని వ్యవసాయాధికారులు అంచనా వేయగా, సీజన్ ప్రారంభంలో అనావృష్టి రైతులను వేధించింది. జూలైలో మాత్రం వర్షాలు దంచికొట్టడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. దీంతో అంచనా వేసిన సాగు విస్తీర్ణాన్ని ఈనెలాఖరుకు సాధించే అవకాశం ఉన్నట్లు వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

ఈ నెలాఖరు వరకు వరి వేసుకోవచ్చు



వరి ఈ నెలాఖరు వరకు వేసుకోవచ్చు. మొదట్లో వర్షాలు లేకపోగా, తర్వాత భారీ వర్షాలు కురిశాయి. దీంతో ఈ సారి వరి ఆశించిన దానికంటే ఇప్పటివరకు తక్కువగా సాగైంది. ఈ నెలాఖరు నాటికి వరి విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంటుంది.

– కొర్స అభిమన్యుడు, జిల్లా వ్యవసాయాధికారి

వరికి బదులు మొక్కజొన్న వేశాం



వర్షాలు ఆలస్యం కావడంతో వరికి బదులు మొక్కజొన్న వేశాం. మొక్కజొన్న పంట త్వరగా చేతికి వచ్చే అవకాశం ఉండడంతోపాటు పెట్టుబడి ఖర్చు కూడా తగ్గుతుందనే ఆలోచనతో మొక్కజొన్న సాగు చేశాం.

– ఎం.మల్లయ్య, రైతు, ఇల్లెందు మండలం

క్లుప్తంగా

అవగాహన, అప్రమత్తత అవసరం

డీఎస్పీ అబ్దుల్ రెహమాన్



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ

కొత్తగూడెంటౌన్: మహిళలు తమ చుట్టూ ఉన్న వారి పట్ల అప్రమత్తంగా ఉంటూ.. విద్యార్థి దశ నుంచే నేటి సమాజంపై అవగాహన పెంపొందించుకోవాలని కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ అన్నారు. గురువారం కొత్తగూడెం వన్‌టౌన్ సీఐ కరుణాకర్ ఆధ్వర్యాన కొత్తగూడెం రైటర్‌బస్తీలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన 'మహిళ భద్రత – సైబర్ నేరాలపై అవగాహన'సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, సైబర్ మోసాలకు గురి కాకుండా జాగ్రత్తలు పాటించాలని, ఎవరైనా ఫోన్ చేసి మీ వ్యక్తిగత విషయాలు, డాక్యుమెంట్లను అడిగితే ఇవ్వరాదని సూచించారు. మాదక ద్రవ్యాలు, చెడు వ్యసనాలకు దూరం ఉంటేనే భవిష్యత్ బంగారం అవుతుందని తెలిపారు. మహిళలు అత్యవసర సమయంలో డయల్ 100 లేదా 1930కు చేసి సమాచారం ఇస్తే తక్షణమే పోలీసుల ఘటనాస్థలికి చేరుకుని అండగా నిలుస్తారని పేర్కొన్నారు.

అంతర్జాతీయ టోర్నీకి ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న డీవైఎస్‌ఓ, కోచ్‌లు

ఖమ్మం స్పోర్ట్స్: చైనా దేశంలో జరగనున్న అంతర్జాతీయ కుంగ్–ఫూ చాంపియన్‌షిప్‌లో భారత్ జట్టు తరఫున జిల్లా క్రీడాకారులు ఇద్దరు ప్రాతినిధ్యం వహించనున్నారు. ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఉషూలో శిక్షణ తీసుకుంటున్న అన్నాచెల్లెలు పి.సత్యజిత్ చారి, పి.పవిత్రాచారి టోర్నీకి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా వీరిని డీవైఎస్‌ఓ టి.సునీల్‌కుమార్ రెడ్డి సన్మానించగా, కోచ్‌లు పి.పరిపూర్ణాచారి, ఎం.డీ.మతిన్, ఓలేటి సాంబమూర్తి, కైలాస్ పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పుస్తకాలు

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం కార్పొరేట్ ఏరియాలోని వివిధ డిపార్ట్‌మెంట్లలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు సీఎంపీఎఫ్ పుస్తకాలను కార్పొరేట్ డీజీఎం పి.రాజశేఖర్ గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంట్రాక్ట్ కార్మికుల వేతనం నుంచి రికవరీ అయ్యే సొమ్ముకు కంపెనీ కూడా కొంత కలిపి సీఎంపీఎఫ్‌లో జమ చేస్తుందని, కార్మికులు సక్రమంగా విధులకు హాజరైతే మంచి వేతనాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు రవికుమార్, కరుణాకర్‌రెడ్డి, రమణమూర్తి, ఏ.వీ.మేష్, ఎం.ఎస్ఆర్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

చెట్లు కొట్టినందుకు జరిమానా..


ఇల్లెందు: దుకాణాలకు అడ్డుగా ఉన్నాయని చెట్లను కొట్టినందుకు ఆ దుకాణ యజమానులకు మున్సిపల్ అధికారులు జరిమానా విధించిన సంఘటన ఇది. వివరాల్లోని వెళ్తే.. పట్టణంలోని జగదాంబా సెంటర్‌లో దుకాణాలకు కమ్ముకుని ఉన్న చెట్లను అక్కడి దుకాణా యజమానులు కొట్టేశారు. గమనించిన మున్సిపల్ సిబ్బంది హుటాహుటిన అక్కడకు చేరుకుని.. ఎవరి అనుమతితో చెట్లను కొట్టాశావంటూ రెండు దుకాణాలకు జరిమానా విధించారు. దీంతో ఒక్కొక్కరు రూ.వెయ్యి చొప్పున జరిమానా చెల్లించి.. చెట్లు కొట్టిన పాపానికి జరిమానా విధించారని లబోదిబోమంటున్నారు.

మానసిక వికాస కేంద్రానికి విద్యార్థిని విరాళం



చెక్కు అందజేస్తున్న విద్యార్థిని బంధువులు

ఖమ్మం సహకారనగర్: అమెరికాలో చదువుకుంటున్న కావ్య రచన ఖమ్మం బైపాస్ రోడ్డులోని మానసిక వికాస కేంద్రం విద్యార్థుల కోసం రూ.40వేలను ప్రకటించింది. ఈమేరకు ఆమె తాతయ్య, నానమ్మ చావా రమేష్‌బాబు, సంపూర్ణ గురువారం కేంద్రం నిర్వాహకురాలు చావా కృష్ణవేణికి చెక్కు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ యూఏలోని ఇంటి వద్ద వంగనారు పెంచి విక్రయించగా వచ్చిన నగదును పంపించిందని తెలిపారు. ఈకార్యక్రమంలో పీఆర్‌టీయు రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు యలమద్ది వెంకటేశ్వర్లుతో పాటు ఆళ్ల వెంకట్రావు, సిరిపురపు రమణారావు తదితరులు పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.13,091

స్వయం ఉపాధి.. ఎండమావే!

ఎస్సీ కార్పొరేషన్ రుణాలు అందక ఏడాది

- 2020–21 ఏడాదిలో జిల్లాకు 337 యూనిట్లు కేటాయింపు
- ఇప్పటి వరకు సబ్సిడీ విడుదల చేయని వైనం
- రాష్ట్ర ఖజానా శాఖలోనే పెండింగ్
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు



రుణాల వివరాలిలా..

ఎస్సీ కార్పొరేషన్‌లో ఎంపిక చేసిన యూనిట్లు: 337	
మొత్తం రుణాల విలువ	: రూ.9,63,44,000
బ్యాంక్ రుణం	: రూ.3,57,00,000
ప్రభుత్వ సబ్సిడీ	: రూ.6,06,43,000

కొత్తగూడెంరూరల్: ఎస్సీ కార్పొరేషన్ రుణాలపై లబ్ధిదారుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. 2020–21 ఆర్థికసంవత్సరంలో ఎంపిక చేసిన లబ్ధిదారులకు నేటివరకు రుణాలు అందలేదు. ప్రభుత్వ సాయంతో స్వయం ఉపాధి పొందాలనుకున్న లబ్ధిదారులకు యూనిట్లు మంజూరు చేస్తున్నా.. సబ్సిడీ విడుదల కాకపోవడంతో వారికి నిరాశే మిగిలింది. 2020–21 ఏడాదిలో జిల్లాకు ఎస్సీ కార్పొరేషన్ రుణాల కింద 337 యూనిట్లు కేటాయించారు. దాదాపు ఏడాది కావొస్తున్నా.. రుణాలపై ఎటువంటి సమాచారం లేకపోవడంతో రుణాలు అందుతాయో.. లేదోనని ఆందోళన చెందుతున్నారు. దీనికోసం లబ్ధిదారులు ప్రతిరోజు కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగడమే సరిపోతోంది.

మూడుసార్లు ఇంటర్వ్యూలు..

ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం 2020 ఆగస్టులో ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఆ సమయాన కరోనా కాలం కావడంతో దరఖాస్తులు తక్కువగా వచ్చాయి. అక్టోబర్‌లో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు నిర్వహించినప్పటికీ కరోనా కారణంగా చాలామంది ఇంటర్వ్యూలకు హాజరు కాలేకపోయామని కలెక్టర్‌కు తెలియజేశారు. దీంతో ఆ ఇంటర్వ్యూలను రద్దు చేసి మరోమారు దరఖాస్తులను ఆహ్వానించారు. ఆ తర్వాత కూడా మూడోసారి దరఖాస్తులు తీసుకుని ఇంటర్వ్యూలు నిర్వహించారు. కాగా, జిల్లాకు కేటాయించిన 337యూనిట్లకు గాను రూ.9,63,44,000లు అందించాల్సి ఉండగా.. ఇందులో ప్రభుత్వ సబ్సిడీ రూ.6,06,43,000లు ఉంది. కానీ ఈ సబ్సిడీని ప్రభుత్వం ఇప్పటివరకు అందజేయలేదు.

ఖజానా శాఖ దగ్గర ఫైల్..

జిల్లాకు కేటాయించిన 337 యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేశాక ఆ ఎంపిక చేసిన ఫైల్‌ను కలెక్టర్ ఉన్నతాధికారులకు పంపించారు. ఈ యూనిట్లలో రవాణా రంగానికి 70 యూనిట్లు కేటాయించగా.. ఇందులో కార్లు, ఆటోలు, ఇతర ట్యాక్సీ వాహనాల కోసం మొత్తం రూ.2,62,48,000 సబ్సిడీ రావాల్సి ఉంది. మిగితా 267 యూనిట్లలో పేపర్ ప్లేట్లు, కాంక్రీట్ మిల్లు, ఫొటో స్టూడియోలు, ఇంటర్‌నెట్, చెప్పుల షాపులు తదితర యూనిట్లు ఉండగా.. వీటికి రూ.3,47,94,000లు రావాల్సి ఉంది. ఈ యూనిట్లకు లబ్ధిదారులను ఎంపిక చేసినప్పటికీ.. ఫైల్ ఖజానాశాఖలోనే ఉంది. ఇందుకు సంబంధించి నిధులను ఖజానాశాఖ విడుదల చేస్తేనే రుణాలు అందనున్నాయి.

లబ్ధిదారుల్లో అనుమానాలు..

రుణాలు ఆలస్యం అవుతున్న నేపథ్యాన ఎంపికైన లబ్ధిదారుల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2020–22 ఆర్థిక సంవత్సరానికి మైనార్టీ రుణాల కింద మంజూరైన 140 యూనిట్లకు 3,300 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను సంబంధించి అధికారులు నిర్లక్ష్యం చేయడంతో ముందుకు సాగలేదు. ఇదే సమయాన ప్రభుత్వం 100శాతం సబ్సిడీతో మైనార్టీ బంధు పేరుతో రుణాలను అందజేస్తామని ప్రకటించింది. ఈ నేపథ్యంలో అధికారులు మైనార్టీ రుణాలకు వచ్చిన దరఖాస్తులు 3,300లను మైనార్టీ బంధులో కలిపేశారు. దీంతో మైనార్టీ రుణాల రద్దయ్యాయి. దీంతో గతంలో ఎంపిక చేసిన ఎస్సీ కార్పొరేషన్ రుణాలను కూడా దళితబంధు వంటి వాటిలో కలిపేస్తారా..? అనే అనుమానాలు లబ్ధిదారుల్లో కలుగుతున్నాయి.

అణగారిన వర్గాల అభివృద్ధే లక్ష్యం

- 300 మందికి రూ.3 కోట్ల బీసీ బంధు చెక్కుల పంపిణీ
- ఎవరైనా రూపాయి అడిగినా నిలదీయండి : ఎమ్మెల్యే హరిప్రియ



లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే హరిప్రియ, నాయకులు

ఇల్లెందు: చేతి వృత్తులను నమ్ముకుని జీవిస్తున్న అణగారిన వర్గాలను అభివృద్ధి చేయటం కోసం సీఎం కేసీఆర్ బీసీబంధు అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే హరిప్రియ తెలిపారు. గురువారం ఇల్లెందు వ్యవసాయ మార్కెట్‌లో 300 మందికి బీసీ బంధు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హరిప్రియ మాట్లాడుతూ.. కుల వృత్తి చేసుకుని జీవిస్తున్న వారు వ్యాపారంలో రాణించేందుకే బీసీబంధు పథకం వచ్చిందన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఈ పథకం లేదన్నారు. గత ప్రభుత్వాల హయాంలో గ్రామాల్లో కుల వృత్తులు ఆదరణ కోల్పోయాయని, వృత్తిదారులు ఆ పని వదిలేసి బతుకుదెరువు కోసం పట్టణాలకు వలస వెళ్లేవారని తెలిపారు. వలసల నివారణే ప్రస్తుత ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. గతంలో ఏ పథకం మంజూరు కావాలన్నా ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగి పైరవీలకే సగం డబ్బు ఖర్చు చేసేవారని, 80 శాతం వాటా కోసం బ్యాంకుల చుట్టూ ఏళ్ల పాటు తిరుగాల్సి వచ్చేదని అన్నారు. ప్రస్తుతం ఏ ఇబ్బందీ లేకుండా దరఖాస్తు చేసుకుంటే రుణం ఇంటికి వచ్చి అందుతోందని చెప్పారు. బీసీ బంధు పొందిన వారంతా సద్వినియోగం చేసుకుని, ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డి.వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ దిండిగాల రాజేందర్, జెడ్పీటీసీ ఉమ, ఎంపీపీలు నాగరత్నమ్మ, సుజాత, రాధ, కమిషనర్ కుమారస్వామి, సొసైటీ చైర్మన్ మెట్ల కృష్ణ, డీసీసీబీ డైరెక్టర్ జనగం కోటేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రమోద్, బీఆర్ఎస్ నేతలు శీలం రమేష్, బొమ్మెర వర ప్రసాద్, ధనియాకుల హనుమంతరావు, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ను గద్దె దించేందుకు సిద్ధం



మాట్లాడుతున్న పరమేశ్వర్ నాయక్, పక్కన పొదెం వీరయ్య

భద్రాచలం టౌన్: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకు కాంగ్రెస్ సైన్యం సిద్ధంగా ఉందని, తెలంగాణలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనని డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే పొదెం వీరయ్య, కర్ణాటక మాజీ మంత్రి పరమేశ్వర్ నాయక్ అన్నారు. భద్రాచలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో గురువారం జరిగిన మహబూబాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగి పేదలపై మోయలేని భారం పడుతోందని విమర్శించారు. ఇక కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రతి వస్తువుపై జీఎస్టీ రూపంలో పసూలు చేస్తున్న ప్రజాధనాన్ని ఏం చేస్తోందో చెప్పాలని డిమాండ్ చేశారు. మణిపూర్‌తో పాటు దేశమంతా నిత్యం మహిళలపై దాడులు జరుగుతున్నాయని, వారిని రక్షించడంలో కేంద్రం విఫలమైందని ఆరోపించారు. నల్లధనాన్ని వెనక్కు తీసుకొస్తానన్న ప్రధాని నరేంద్రమోదీ, తెలంగాణలో దళితున్ని సీఎం చేస్తానన్న కేసీఆర్ ప్రజలను మోసం చేశారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ప్రజలు బీజేపీ, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పి కాంగ్రెస్‌ను ఆదరించాలని కోరారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం



దాతలకు రశీదు ఇస్తున్న ఆలయ అధికారులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన భక్తులు గురువారం విరాళం అందజేశారు. హైదరాబాద్‌లోని కొత్తపేట కాలనీకి చెందిన కొండమీద వెంకటరమణయ్య రూ.లక్ష డీడీని ఆలయ అధికారులకు అందజేసి స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ సాయిబాబ, అర్చకులు పాల్గొన్నారు.

ఇత్తడి గుండిగలు బహూకరణ..

కర్ణాటక రాష్ట్రంలోని వైష్ణవ సంప్రదాయానికి చెందిన పరకాల మఠం నిర్వాహకులు గురువారం భద్రాద్రి దేవస్థానానికి ఇత్తడి గుండిగలు బహూకరించారు. ఈసందర్భంగా మఠం నిర్వాహకులు కృష్ణారెడ్డి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈఓ రమాదేవికి ఐదు గుండిగలు అందజేసి పూజ కార్యక్రమాల్లో ఉపయోగించాలని కోరారు.

అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో ప్రవేశాల గడువు పొడిగింపు

పాల్వంచరూరల్: డాక్టర్ బీ.ఆర్.అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయంలో డిగ్రీ అడ్మిషన్ల గడువు వచ్చేనెల 20వ తేదీ వరకు పొడిగించినట్లు కోఆర్డినేటర్ ఈ.విజయ్‌కుమార్ తెలిపారు. రూ.100 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 20 వరకు, రూ.200 అపరాధ రుసుముతో సెప్టెంబర్ 30వ తేదీ వరకు ప్రవేశాలు పొందొచ్చని పేర్కొన్నారు. బీఏ, బీకాం, బీఎస్సీలో ప్రవేశాల కోసం ఆసక్తి ఉన్న వారు 73829 29727, 94419 08635 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సింగరేణిని కాపాడుకుందాం



మాట్లాడుతున్న కూనంనేని సాంబశివరావు, పక్కన నాయకులు

కూనంనేని పిలుపు

సింగరేణి(కొత్తగూడెం): ప్రైవేటీకరణ ఆర్థిక దోపిడీ నుంచి సింగరేణి సంస్థను కాపాడుకుందామని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. కొత్తగూడెంలోని శేషగిరి భవన్‌లో గురువారం నిర్వహించిన యూనియన్ మహాసభలో ఆయన మాట్లాడారు. సంస్కరణల పేరుతో సింగరేణిని నిర్వీర్యం చేసేలా ప్రైవేటీకరణ, ఆర్థిక దోపిడీకి పాల్పడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలను అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఏర్పాటుకు ముందు 64 వేల మంది కార్మికులు ఉండగా ప్రస్తుతం 40 వేల మంది మాత్రమే ఉన్నారని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న సంస్కరణలే కారణమని విమర్శించారు. సీఎం కేసీఆర్ కార్మికులకు ఇచ్చిన హామీలను విస్మరిస్తున్నారని ఆరోపించారు. కారుణ్య నియామకాలు, నూతన భూగర్భ గనులు, కార్మికులకు సొంతింటి పథకం వంటివి అమలు చేయకుండా సంస్థపై పెత్తనం చెలాయించే హక్కు ఆయనకు లేదన్నారు. సభలో యూనియన్ ప్రధాన కార్యదర్శి వాసిరెడ్డి సీతారామయ్య, మిరియాల రంగయ్య, ఎస్‌కే సాబీర్‌పాషా, రాజ్‌కుమార్, వీరస్వామి, వంగా వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

రామగుండం సీటు జనక్‌ప్రసాద్‌కు కేటాయించాలి



సమావేశంలో మాట్లాడుతున్న త్యాగరాజన్

సింగరేణి(కొత్తగూడెం): ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్‌కు రామగుండం అసెంబ్లీ స్థానం నుంచి పోటీ చేసే అవకాశం కల్పించాలని యూనియన్ జనరల్ సెక్రటరీ సి.త్యాగరాజన్ కోరారు. ఈమేరకు కాంగ్రెస్ నాయకత్వం పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. కొత్తగూడెంలోని కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేలాది మంది కార్మికుల సమస్యల సాధనకు పాటుపడుతున్న జనక్‌ప్రసాద్‌ను పోటీకి దింపితే అత్యధిక మెజారిటీతో విజయం సాధ్యమవుతుందని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు ఆల్బర్ట్, లింగాల జగన్నాథం, వెలగపల్లి జాన్, అభిషేక్, ఆర్.కన్నయ్య, రాజేశ్వరరావు, ఐలూరి రమణయ్య, సైమన్ పాల్గొన్నారు.

రహదారిపై మృతదేహంతో ఆందోళన



ఆందోళన చేస్తున్న మృతురాలి బంధువులు

దమ్మపేట: వైద్యుడి నిర్లక్ష్యంతోనే మహిళ మృతిచెందిందని ఆరోపిస్తూ రోడ్డుపై ఆమె బంధువులు ధర్నాకు దిగిన ఘటన ఇది. వివరాల్లోకి వెళితే..మండల పరిధిలోని అల్లిపల్లి గ్రామానికి చెందిన పొండ్ల నందిని(28) అనే వివాహిత ఈ నెల 3వ తేదీన తీవ్రమైన కడుపునొప్పితో బాధపడుతుండగా ఆమె కుటుంబసభ్యులు మండల కేంద్రంలోని భవానీ నర్సింగ్ హోమ్‌కు తీసుకొచ్చారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్ శాంతన్ ఆమె కడుపులో పెద్ద కణితి ఉండడం వల్ల ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని తెలిపింది. ఆతర్వాత ఆమె భర్త, బంధువుల అంగీకారంతో అదే రోజున డాక్టర్ శస్త్ర చికిత్స నిర్వహించి సుమారు నాలుగు కేజీల కణితిని తొలగించారు. అనంతరం మూడు రోజుల పాటు ఆస్పత్రిలో ఉండగా 6వ తేదీన ఆమెకు మూత్ర సంబంధిత సమస్య తలెత్తడంతో డాక్టర్ సలహా మేరకు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు. అక్కడ ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో మూడు రోజుల పాటు చికిత్స చేయించుకున్న అనంతరం వైద్య ఖర్చులు భరించలేక హైదరాబాద్‌లోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది.

మృతదేహంతో ఆందోళన..

బాధితులు మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు భవానీ నర్సింగ్ హోమ్, డాక్టర్ నిర్లక్ష్యంతోనే ఆమె మృతి చెందిందని ఆరోపిస్తూ ఆస్పత్రి ఎదుట రహదారిపై మృతదేహంతో ఆందోళనకు దిగారు. దీంతో రోడ్డుపై వాహనాలు భారీగా నిలిచిపోగా.. సంఘటనా స్థలానికి ఎస్సై రవికుమార్ చేరుకొని మృతురాలి బంధువులతో మాట్లాడి ఆందోళన విరమింపజేశారు.

నిర్లక్ష్యం ఏమాత్రం లేదు..

బాధితురాలి కడుపులో ఉన్న కణితితో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉందని చెప్పగా.. ఆమె కుటుంబ సభ్యుల విజ్ఞప్తి మేరకు శస్త్ర చికిత్స చేశాను. కాని కణితి అప్పటికే పగిలిపోయే స్థితికి వచ్చింది. శస్త్ర చికిత్స అనంతరం మూడు రోజుల తర్వాత మూత్ర సంబంధిత సమస్య రావడంతో ఆమెను ఖమ్మం తీసుకెళ్లాలని చెప్పాను. అంతేకానీ శస్త్ర చికిత్సలో తన వైఫల్యం, నిర్లక్ష్యం ఏమాత్రం లేదు.

– శాంతన్, డాక్టర్, భవానీ నర్సింగ్ హోమ్

ఆర్థిక ఇబ్బందులతో.. వివాహిత ఆత్మహత్య

ఇల్లెందురూరల్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వివాహిత పురుగుల మందు తాగి గురువారం ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మస్సివాగు గ్రామ పంచాయతీ ధర్మారంతండా గ్రామానికి చెందిన లాకావత్ రజిత(34) తన భర్త మోతీలాల్ తమకు ఉన్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. రెండేళ్ల క్రితం ఆమె భర్త తీవ్ర అనారోగ్యానికి గురికావడంతో అప్పు చేసి వైద్యం అందించారు. అయితే పక్షం రోజులుగా వర్షం జాడలేకపోవడంతో మొక్కజొన్న చేను వాడిపోవడంతో తీసుకొచ్చిన అప్పులు ఎలా తీర్చాలో అర్థంకాక గురువారం చేను వద్దే పురుగుల మందు తాగి ఇంటికి వచ్చింది. వాసనతో గుర్తించిన కుటుంబ సభ్యులు వెంటనే ఇల్లెందు ఆస్పత్రికి ఆపై ఖమ్మం అక్కడి నుంచి హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. అయినా ఫలితం లేక రజిత తుదిశ్వాస విడిచింది. ఆమెకు ముగ్గురు ఆడపిల్లలు ఉన్నారు.

పురుగుల మందు తాగి వ్యక్తి..

పాల్వంచ: కడుపునొప్పి తాళలేక ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణ పరిధిలోని వనమా కాలనీకి చెందిన గోగుల శ్రీను(60) ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, గత కొంత కాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. ఈనేపథ్యంలో రెండేళ్ల క్రితం కూతురి వివాహం చేయడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాడు. ఈక్రమంలో కడుపు నొప్పికి చికిత్స చేయించుకోలేకపోయాడు. ఈక్రమంలో గురువారం కడుపునొప్పి ఎక్కువగా రావడంతో ముత్యాలమ్మ తల్లి గుడి సమీపంలో పురుగుల మందు తాగి కొడుకు మహేంద్రకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో అతడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, కొడుకు ఉన్నారు. కొడుకు ఫిర్యాదుమేరకు ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

చుంచుపల్లి: మండల పరిధిలోని నందతండా గ్రామశివారు గోధుమ వాగు పక్కన ఓ చెట్టుకు గేరు వైర్‌తో ఓ వ్యక్తి ఉరి వేసుకొని మృతిచెంది ఉండటాన్ని గురువారం చుంచుపల్లి పోలీసులు గుర్తించారు. ఐదు రోజుల క్రితం చనిపోయిన ఆ వ్యక్తి వ్యక్తి వయసు 39 ఏళ్లు ఉండొచ్చని, నలుపు రంగు ప్యాంట్, స్కైబ్లూ కలర్ ఆఫ్ టీషర్ట్‌తో సుమారు 5.6 అడుగులు ఎత్తు ఉంటాడని తెలిపారు. వివరాలు తెలిసి వారు 87126 82033 నంబర్‌ను సంప్రదించాలని ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.


ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు

పాల్వంచరూరల్: ఓ వృద్ధుడిని ఢీకొట్టి గాయపరిచిన ద్విచక్ర వాహనదారుడిపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ కార్తీక్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధి సోములగూడెం గ్రామానికి చెందిన పెద్దినీటి లక్ష్మయ్య తన టీవీఎస్ ద్విచక్రవాహనంపై గురువారం ఇంటికి వెళ్తున్నాడు. ఈక్రమంలో బిక్కుతండా శివారులో బస్వతారాక కాలనీకు చెందిన కోల్లి నవీన్ అనే వ్యక్తి తన ద్విచక్రవాహనంతో ఆ వృద్ధుడిని ఢీకొట్టాడు. దీంతో వృద్ధుడికి గాయాలు కాగా మునగాండ్ల ప్రేమ్‌కుమార్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవీన్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

దుర్భాషలాడిన వ్యక్తిపై..

కరకగూడెం: మండలంలోని సమత్ భట్టుపల్లి గ్రామానికి చెందిన ఓ వివాహితపై అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి అసభ్యకరంగా ప్రవర్తించి, దుర్భాషలాడడంతో బాధితురాలు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసింది. ఈమేరకు సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కరకగూడెం ఎస్సై రాజారాం గురువారం తెలిపారు.

జ్వరంతో వ్యక్తి మృతి



కోటిరెడ్డి (ఫైల్)

బూర్గంపాడు: జ్వరంతో బాధపడుతూ లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలిలా.. గ్రామానికి చెందిన సింగం కోటిరెడ్డి(40) గత వారం రోజులుగా జ్వరంతో బాధపడుతున్నాడు. దీంతో కుటుంబసభ్యులు భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయినా జ్వరం తగ్గకపోవడంతో విజయవాడకు తరలించి చికిత్స అందిస్తుండగా.. గురువారం తెల్లవారు జామున మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు.

నలుగురు పేకాట రాయళ్ల అరెస్ట్

జూలూరుపాడు: జూలూరుపాడు గ్రామ శివారులో పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారంతో గురువారం ఎస్‌ఐ బి.పురుషోత్తం తన పోలీస్ సిబ్బందితో కలిసి పేకాట స్థావరంపై దాడి చేశారు. ఈ దాడిలో నలుగురు పేకాట రాయళ్లను పట్టుకొని, వారి వద్ద నుంచి రూ.5,030 నగదు, మూడు సెల్ ఫోన్లు, ఒక బైక్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన నలుగురు వ్యక్తులు అన్నారుపాడు కాగా వీరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు

నేలకొండపల్లి: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ఘటనలో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు... నాచేపల్లి నుంచి నేలకొండపల్లికి వస్తున్న నాగరాజు, నాగేశ్వరరావు, నేలకొండపల్లి నుంచి మంగాపురంతండా వెళ్తున్న భూక్యా నాగేశ్వరరావు, తేజావత్ నాగేశ్వరరావు బైక్‌లు నాచేపల్లి బ్రిడ్జి వద్ద గురువారం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో నలుగురికి తీవ్రగాయాలు కాగా, నేలకొండపల్లిలో ప్రథమ చికిత్స అనంతరం 108లో ఖమ్మం తరలించారు.